సాక్షి అనకాపల్లి

గురువారం : 29 : జూన్ : 2023

న్యూస్‌రీల్

క్విజ్ పోటీల్లో గిడుతూరు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

మాకవరపాలెం: జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో మండలంలోని గిడుతూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ నెల 21న ఆర్‌బీఐ ఆధ్వర్యంలో మండలస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లోనూ తొమ్మిదో తరగతి చదువుతున్న దనిమిరెడ్డి భరణికుమార్, నీలం విజయ్‌కుమార్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. వీరికి బుధవారం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి రూ.7,000 చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరిని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, ఎంఈవోలు నరేష్, మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

41.22 టన్నుల పీడీఎస్ బియ్యం వేలం

- రూ.12.40 లక్షల ఆదాయం



రేషన్ బియ్యం వేలం వేస్తున్న అధికారులు

యలమంచిలి: అక్రమంగా రవాణా చేస్తున్న కేసుల్లో పట్టుబడిన 41.22 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు బుధవారం వేలం వేశారు. మండలంలో లైనుకొత్తూరు గ్రామం వద్ద ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో తహసీల్దార్ రాణీ అమ్మాజీ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. కిలో బియ్యం ధర రూ.18గా అధికారులు నిర్ణయించగా పాటదారులు రూ.30.10కు పాడారు. 41.22 టన్నులకు రూ.12,40,078 ఆదాయం ప్రభుత్వానికి సమకూరినట్టు అధికారులు తెలిపారు. ఈ వేలం పాటలో 18 మంది రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి ఈశ్వరావు, ఆర్‌ఐ విష్ణు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు



లోపూడి వద్ద రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న డీఈ నాగమోహన్‌రావు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డు విస్తరణ పనులను నాణ్యతాప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేయాలని నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ డీఈ నాగమోహన్‌రావు తెలిపారు. బుధవారం ఆ రోడ్డు విస్తరణ, తారు రోడ్డు నిర్మాణ పనులను, వినియోగిస్తున్న మెటీరియల్‌ను ఆయన పరిశీలించారు. పొట్టిదొరపాలెం, బుదిరెడ్లపాలెం, శింగవరం, లోపూడిల మధ్య జరుగుతున్న పనులను ఆయన జేఈ సాయి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. నాణ్యతాప్రమాణాలు లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ రోజు ఎంత విస్తీర్ణంలో రోడ్డు పనులు జరిగాయో జియో ట్యాగింగ్ చేసి ఎప్పటి పనులు అప్పుడే రికార్డు చేస్తున్నట్టు చెప్పారు. వాహనాల రాకపోకలు నిలిచిపోకుండా తారు రోడ్డు పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. శిథిల మదుములు, కల్వర్టులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీఎన్ రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేయడానికి తగిన చర్యలు చేపట్టామన్నారు. వర్క్ ఇన్స్పెక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ వ్యాగన్ నుంచి మంటలు



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లిటౌన్: స్థానిక రైల్వేస్టేషన్‌లో నిలిచి ఉన్న గూడ్స్ రైలు వ్యాగన్ నుంచి మంటలు వచ్చాయి. గమనించిన సిబ్బంది స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది రైల్వేస్టేషన్‌కు చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.20 వేల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక అధికారి బి.నర్సింగరావు అంచనా వేశారు.

ఆహ్లాదం... నగర జీవనం



బయ్యవరం అటవీ ప్రాంతం



ఆరిల్లోవ అటవీ భూములు

- మూడు ప్రాంతాల్లో నగర వనాలు
- జిల్లాలో అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నాలకు సమీపంలో ఏర్పాటు
- వంద హెక్టార్ల అటవీ భూమిలో వసతులు
- రూ.3.80 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు

నర్సీపట్నం: జిల్లాలో ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని, పచ్చదనాన్ని అందించేందుకు నగర వనాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాకినాడకు సమీపంలో ఉన్న కోరంగి మడ అడవులు ఎంతగానో ప్రాచుర్యం పొందిన విషయం అందరికీ తెలిసిందే.. కాకినాడ వెళ్లే వారు దాదాపు మడ అడవులను సందర్శించకుండా తిరిగిరారు. అదే మాదిరిగా జిల్లాలోని జనావాసాలకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఈ వనాల్లో అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. జిల్లాలో అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నానికి చేరువలో జనావాసాలకు సమీపంలో ఉన్న బయ్యవరం, వేమగిరి, ఆరిల్లోవ అటవీ ప్రాంతాలను గుర్తించి, వాటిని తీర్చిదిద్దేందుకు అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి రూ.3.80 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరైన వెంటనే రిజర్వ్ ఫారెస్టులో సుందరీకరణ పనులు చేపడతారు.

ఆహ్లాదం పంచేందుకే ..

మున్సిపాలిటీల్లో ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు పార్కులు మినహా సరైన ఉద్యానవనాలు లేవు. సెలవు రోజుల్లోను, పండగ సమయాల్లో గడిపేందుకు సరైన ప్రాంతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. నగర వనాలు ఏర్పాటు చేస్తే ఆయా పట్టణాల ప్రజలకు ఊరట లభిస్తుంది. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు ఈ వనాలు దోహదపడతాయి.

- నర్సీపట్నం మున్సిపాలిటీలో 67 వేల మంది జనాభా ఉన్నారు. వీరి కోసం నర్సీపట్నానికి ఏడు కిలోమీటర్ల దూరంలో గల ఆరిల్లోవలోని 25 హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని రూ.80 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు.
- యలమంచిలి మున్సిపాలిటీలో 40 వేల మంది జనాభా ఉన్నారు. పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలోనున్న వేమగిరిలోని 25 హెక్టార్లలో అటవీ ప్రాంతాన్ని రూ.కోటితో అభివృద్ధి చేయనున్నారు.
- జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో జనాభా 2.20 లక్షల మంది. బయ్యవరం రిజర్వ్ ఫారెస్టులో 50 హెక్టార్లను రూ.2 కోట్లతో సుందరీకరించేందుకు అటవీ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

ఈ నిధులతో నగరవనాల్లో వాకింగ్ ట్రాక్, ఆహ్లాదాన్ని ఇచ్చే మొక్కలు, రచ్చబండ తరహాలో బెంచీలు, టాయిలెట్లు, లైటింగ్, ఆర్చ్, సోలార్ బోర్ వెల్స్, ఆర్వోప్లాంట్, పార్కింగ్ ఏరియా, పిల్లలకు సామగ్రి తదితర వాటిని సమకూర్చనున్నారు.



వేమగిరి అడవులు

ప్రతిపాదనలు పంపాం



పట్టణ వాసులకు ఆహ్లాదాన్ని అందించడంలో భాగంగా ప్రభుత్వం నగర వనాల అభివృద్ధికి బాటలు వేసింది. జిల్లాలోని బయ్యవరం, వేమగిరి, ఆరిల్లోవ అటవీ ప్రాంతాలను నగర వనాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి రూ.3.80 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

– రాజారావు, జిల్లా అటవీశాఖ అధికారి

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయసాయిరెడ్డి



ముఖ్యమంత్రిని కలిసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మంత్రి అమర్‌నాథ్

గోపాలపట్నం(విశాఖ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో అమ్మ ఒడి కార్యక్రమం ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక విమానంలో ఉదయం 9.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. 9.20 గంటలకు హెలికాప్టర్‌లో ఇక్కడి నుంచి కురుపాం బయలుదేరి వెళ్లారు. ఆయన్ని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, అదీప్ రాజ్, కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. కురుపాం నుంచి హెలికాప్టర్‌లో సీఎం వైఎస్ జగన్ మధ్యాహ్నం 2.53 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి 3.14 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరారు.



సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

మునగపాక: నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. రాత్రి సమయంలో పోలీసు గస్తీని పెంచుతున్నట్టు చెప్పారు. మునగపాక మండలం నాగులాపల్లికి చెందిన యువకుని హత్య కేసు దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, యలమంచిలి సీఐ గఫూర్, ఎస్‌ఐ మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

• మర్యాద పూర్వకంగా..



వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో సుబ్బారెడ్డిని బుధవారం కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు చిక్కాల రామారావు,దాసరి అప్పారావు పాల్గొన్నారు.

- మునగపాక

అమ్మ ఒడి.. అద్భుత పథకం

- జిల్లాలో 1,50,870 మందికి లబ్ధి
- నాల్గవ విడతలో రూ.226.30 కోట్లు మంజూరు
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

తుమ్మపాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవ రత్నాలులో 'అమ్మ ఒడి' అద్భుత పథకమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ తల్లీ తమ బిడ్డలను బడికి పంపకుండా ఉండకూడదని, పిల్లలను బడికి పంపేందుకు ఎటువంటి ఇబ్బందులు అడ్డురాకూడదనే సంకల్పంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ పథకం కింద ప్రతి తల్లి ఖాతాలో రూ.15 వేలు జమచేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన అమ్మఒడి నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో నాలుగవ విడత కింద 1,50,870 మంది తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్న రూ.226.30 కోట్ల చెక్కును ఆయనతో పాటు కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పిల్లలందరూ బడి బాట పట్టి చక్కని విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలతో సహా ఆమోదించిన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు ఈ ప్రయోజనం అందిస్తున్నామన్నారు. ఈ పథకం వల్ల అక్షరాస్యత శాతం శత శాతం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శిరీష, గ్రామవార్డు సచివాలయ నోడల్ అధికారి మంజులావాణి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కార్పొరేటర్ కొణతాల నీలిమాభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మ ఒడి చెక్కును విద్యార్థుల తల్లులకు అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

బ్యాంకులోనే మూలుగుతున్న ఆసరా నిధులు

- లబ్ధిదారులకు చేరని రూ.10 కోట్లు
- సురక్ష సదస్సులో తహసీల్దార్ దృష్టికి
- వెలుగు, ఎస్‌బీఐ సిబ్బంది తీరుపై ఆక్షేపణ

రావికమతం : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా ఉంది.. కొత్తకోట ఎస్‌బీఐ పరిధిలోని 1,180 డ్వాక్రా గ్రూపు మహిళల పరిస్థితి. వైఎస్సార్ ఆసరా మూడవ విడత నిధులు సుమారు రూ.10 కోట్లు లబ్ధిదారులకు చెల్లించకుండా బ్యాంకులోనే మురగబెడుతున్నారు. మూడు నెలల కిందటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేసినా కొత్తకోట ఎస్‌బీఐ బ్రాంచి సిబ్బంది మాత్రం ఆ సొమ్మును ఏ ఒక్క మహిళ ఖాతాకు నేటికీ జమ చేయలేదు. పలుమార్లు డ్వాక్రా మహిళలు, సీఏలు బ్యాంకు మేనేజర్‌ను కలిసేందుకు వెళ్లినా ఏదో సాకు చెబుతూ వెనక్కి పంపించేస్తున్నారని ప్రధాన ఆరోపణ. ఇప్పటికీ నిధులు బ్యాంకులోనే మూలుగుతున్నాయి.

సీఎం ఆశయానికి తూట్లు

రావికమతం, రోలుగుంట మండలాలకు చెందిన 1,180 గ్రూపుల్లోని 16 వేల మంది సభ్యుల లావాదేవీలు ఈ బ్యాంకు శాఖ నుంచే జరుగుతున్నాయి. వైఎస్సార్ ఆసరాలో గడచిన రెండు విడతల నిధులు సుమారు రూ.20 కోట్లు లబ్ధిదారులకు అందాయి. మూడో విడత సొమ్మును మార్చి 25న సీఎం విడుదల చేశారు. అయినప్పటికీ ఆ నిధుల్ని ఏ ఒక్క మహిళా లబ్ధిదారు ఖాతాకూ జమచేయలేదు. దీంతో మహిళల ఆర్థిక అభ్యున్నతికి దోహదపడాలన్న సీఎం జగన్ ఆశయానికి తూట్లు పొడిచినట్టయింది.



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తకోట బ్రాంచి

సురక్ష సన్నాహక సమావేశంలో ఫిర్యాదుతో..

కొత్తకోట గ్రామ పంచాయతీలో జగనన్న సురక్ష సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మహేశ్వరరావు పాల్గొన్నారు. సమావేశానికి పలువురు డ్వాక్రా సభ్యులు వచ్చి ఆసరా సొమ్ము మూడు నెలలైనా తమ ఖాతాల్లో వేయలేదని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోరా? అంటూ సభలో నిలదీశారు. దీంతో తహసీల్దార్ ఈ విషయంపై ఏపీఎం తిలక్‌ను ప్రశ్నించారు. కొత్తకోట బ్యాంకు అధికార్లు మూడు నెలలుగా వేయలేదని, తాను ఎన్నిమార్లు బ్యాంకుకు వెళ్లినా, ఫోన్‌లు చేసినా పట్టించుకోలేదని చెప్పడంతో తహసీల్దార్ మండిపడ్డారు. సుమారు రూ.10 కోట్లు 1,180 గ్రూపుల్లోని 16,560 మంది డ్వాక్రా మహిళలకు ఇంత ఆలస్యం జరిగినా ఇప్పటి వరకూ వెలుగు, బ్యాంకు అధికార్లు పట్టించుకోకపోవడమేంటన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని హెచ్చరించారు.

హడావుడిగా సమావేశం

తహసీల్దార్ మహేశ్వరరావు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని మండిపడడంతో వెలుగు ఏపీఎం తిలక్, సీసీలు బుధవారం సాయంత్రం కొత్తకోట బ్రాంచికి వచ్చారు. బ్రాంచ్ మేనేజర్‌తో సమావేశం నిర్వహించారు. త్వరగా డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాలకు జమచేయాలని ఒత్తిడి తెచ్చారు.



బ్యాంకు అధికారిని ప్రశ్నిస్తున్న ఏపీఎం తిలక్, వెలుగు సీసీలు

టి.అర్జాపురంలో రూ.20 లక్షల స్కాం వల్లే..

టి.అర్జాపురం గ్రామానికి చెందిన ఒక సీసీ, సీఏ నిర్వాకం వల్ల పలు గ్రూపుల సభ్యులకు చెందిన సుమారు రూ.20 లక్షల వరకూ నిధులు దుర్వినియోగం అయ్యాయి. దీనిపై ఏపీఎం తిలక్ ఆ గ్రామంలో పలుమార్లు విచారణ చేశారు. ఈ విషయంలో తప్పు మీదంటే మీదని, కాదు బ్యాంకు ఫీల్డ్ ఆఫీసరుదేనంటూ పరస్పరం నిందలు వేసుకున్నారు. విచారణలో సీసీ తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్టు ఆరోపణలు చేశారు. ఈ కారణంగా మొత్తం అన్ని గ్రూపుల సొమ్మును నిలిపివేయడం సరికాదని డ్వాక్రా మహిళలు వాపోతున్నారు.

జాబితా పంపడంలో జాప్యం వల్లే..

జాబితాను వెలుగు ఏపీఎం, సీసీలను 'ఎక్సెల్' ఫార్మాట్‌లో పంపమన్నాను. వారు ఇప్పటికీ పంపలేదు. అందువల్ల డ్వాక్రా సభ్యుల ఖాతాలో నగదు జమచేయడంలో జాప్యం జరిగింది.

– వీరభద్రరావు, కొత్తకోట ఎస్‌బీఐ బ్రాంచ్‌మేనేజర్

నిబంధనలు పాటించాల్సిందే



మాట్లాడుతున్న విజిలెన్స్ ఎస్పీ స్వరూపరాణి (కింద) హాజరైన ఎరువులు,పురుగుమందుల డీలర్లు

- నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు
- విజిలెన్స్ ఎస్పీ స్వరూపరాణి

అనకాపల్లి రూరల్: ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లు.. ఫెర్టిలైజర్ల నియంత్రణ చట్టాన్ని తప్పనిసరిగా పాటించాలని ఉమ్మడి జిల్లా విజిలెన్స్ ఎస్పీ స్వరూపరాణి స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని డీలర్లపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, రెండు కంటే ఎక్కువ సార్లు నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. పట్టణంలోని గవరపాలెం వి.వి.రమణ రైతు సంఘం సమావేశ మందిరంలో మూడు జిల్లాల పురుగు మందుల డీలర్లతో ఫెర్టిలైజర్ల నియంత్రణ చట్టంపై బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడటం వంటివి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. అనకాపల్లి వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, నాణ్యతలేని ఎరువులు, పురుగుమందులు విక్రయించి రైతులను మోసగిస్తే కఠిన చర్యలు ఎదుర్కోక తప్పదన్నారు. దుకాణాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తనిఖీలకు వచ్చినప్పుడు వ్యవసాయ, విజిలెన్స్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని చెప్పారు. అనకాపల్లి ఏడీఏ రంగాచారి మాట్లాడుతూ నిబంధనలు పాటించని డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చట్టప్రకారం కేసులు పెడతామని హెచ్చరించారు. సమావేశంలో విజిలెన్స్ సీఐలు, ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు, ఆర్బీకేల బాధ్యులు, ఉమ్మడి జిల్లాకు చెందిన 150 మంది ఎరువులు, పురుగుమందులు, విత్తనాల డీలర్లు పాల్గొన్నారు.

పైపులైన్ ప్రాంతాన్ని ఆక్రమిస్తే కేసులు

- హెచ్‌పీసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు భీష్మానందం
- యం.బి.పట్నంలో ఆక్రమణదారులపై ఫిర్యాదు

నాతవరం: గ్యాస్ పైపులైన్ ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్‌పీసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు భీష్మానందం తెలిపారు. మండలంలోని హెచ్‌పీసీఎల్ గ్యాస్ పైపులైన్ ఉన్న యం.బి.పట్నం మన్యపురట్ల, ఎ.శరభవరం ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న భారీ వృక్షాలు, నిబంధనలు ఉల్లఘించి అక్రమంగా నిర్మించిన కట్టడాలను చూశారు. ఆక్రమణలపై తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాసనాయుడును ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వరకు 573 కిలోమీటర్ల పొడవున హెచ్‌సీపీఎల్‌కు చెందిన పైపులైను ఉందన్నారు. ఈ పైపులైన్ ద్వారా గ్యాస్, ఆయిల్ ప్రతి రోజు సరఫరా అవుతుందని చెప్పారు. పైపులైన్‌కు 18 అడుగుల విస్తీర్ణంలో ఎలాంటి కట్టడాలు నిర్మించరాదని, చెట్లు వేయరాదని తెలిపారు. యం.బి.పట్నం ప్రాంతంలో పైప్‌లైన్ ప్రాంతాన్ని ఆక్రమించిన 10మందిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ముందుగా వారిని బైండోవర్ చేస్తామని, మార్పు రాకపోతే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. పైపులైను ఏర్పాటు కోసం రైతుల నుంచి భూములు తీసుకునే సమయంలో ప్రభుత్వం 25 ఏళ్ల క్రితం నష్టపరిహారం ఇచ్చిందన్నారు. పైపులైన్ ఉన్న ప్రాంతంలో భూములు ఆక్రమణకు గురికాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

దేశంలోనే అద్భుతం జగనన్న సురక్ష



జగనన్న సురక్షపై ఎంపీడీవో సుబ్బలక్ష్మిని ఆరా తీస్తున్న జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి

దేవరాపల్లి: ప్రభుత్వ సేవలను ప్రజల చెంతనే అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం దేశ చరిత్రలోనే అద్భుతమని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సీఈవో పి. శ్రీరామమూర్తి అన్నారు. దేవరాపల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమం సర్వే అమలు తీరు, క్యాంప్‌ల ఏర్పాట్లపై స్థానిక ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మిని ఆరా తీశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాలైన సేవలను అందిస్తారన్నారు. ఆయన వెంట ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి జీవీ రమణ ఉన్నారు.

పార్టీ విజయానికి సంపూర్ణ సహకారం

- సీఎం జగన్ ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధికి కృషి
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీ

అనకాపల్లిటౌన్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, జిల్లాలో ఇద్దరు మంత్రుల సహకారంతో ఏడాదిన్నర పాటు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించినట్లు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల క్రితం సీఎంను కలిసినప్పుడు అనకాపల్లి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు ఎక్కువగా ఉన్నారని, జిల్లా పార్టీ బాధ్యతలు బీసీ వర్గానికి ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం తన స్థానంలో బొడ్డేడ ప్రసాద్‌ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడిగా తన హయాంలో జిల్లా వ్యాప్తంగా జిల్లా, మండల స్థాయిల్లో 27 అనుబంధ కమిటీలను ఏర్పాటుచేసి పార్టీ బలోపతానికి కృషి చేసినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విప్, జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన ఏకైక వ్యక్తిగా గుర్తింపు పొందానన్నారు. ఏడాదిలో ఎన్నికలు సమీపిస్తున్నాయని, పార్టీలో కొన్ని మార్పులు చేర్పులు చేసేందుకు సీఎం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వెల్లడించారు. దీనిలో భాగంగా యువతకు మరింతగా పార్టీ బాధ్యతలు అప్పగించేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పార్టీ తీసుకున్న నిర్ణయానికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లానేతలు సుజాత, సురేష్, సతీష్‌లు పాల్గొన్నారు.

భర్త తిట్టాడని గడ్డి మందు తాగింది...



మృతి చెందిన అమలావతి

ఎస్.రాయవరం : భర్త తిట్టాడని మనస్థాపం చెందిన మహిళ గడ్డి మందు తాగి మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రసాదరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గెడ్డపాలెం గ్రామానికి చెందిన మాదేవుపల్లి అమలావతి(39)ని రెండు రోజుల క్రితం ఇంట్లో కూర బాగాలేదని ఆమె భర్త మాణిక్యం మందలించాడు. దీంతో ఆరోజు భోజనం మానేసిన అమలావతి అర్ధ రాత్రి సమయంలో భర్తను భయపెడదామని ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అమలావతి మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

బొడ్డేడకు పదవి పట్ల హర్షం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



బొడ్డేడ క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నేతలు

మునగపాక: బొడ్డేడ ప్రసాద్ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులు కావడంతో ఆపార్టీ శ్రేణులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. బుధవారం మునగపాకలో బొడ్డేడ క్యాంప్ కార్యాలయంలో పార్టీ శ్రేణులు సందడి చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి పార్టీ నేతలు క్షీరాభిషేకం చేశారు.జై జగన్ జైజై జగన్ అంటూ నినదించారు. అలాగే ప్రసాద్‌కు జిల్లా పగ్గాలు అప్పగించడాన్ని స్వాగతిస్తూ పలువురు నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నేత నరాలశెట్టి సూర్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా సత్యనారాయణ, సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీను, భీశెట్టి గంగప్పలనాయుడు, కొరుప్రోలు చిన్నారావు, నర్మాల రామకృష్ణ, ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు, మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి చంద్ర, శరగడం జగన్నాథరావు, రామజోగినాయుడు, దశావతారం, దొడ్డి బుజ్జి, ధనశ్రీను, టెక్కలి కొండలరావు, ఆడారి లక్ష్మణరావు, లీలా భాస్కర్, పరమేష్, నరేంద్ర, జగ్గప్పారావు, పెంటకోట అప్పలనాయుడు, చదరం అప్పలనాయుడు, గుంట్ల అప్పారావు, రాయి బుజ్జి, ధనశ్రీను, పారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

చోడవరం రూరల్ : వ్యానులో గంజాయిని తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు చోడవరం పోలీసులు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు ఇద్దరిని అరెస్టు చేసి, 21 కేజీల గంజాయి, ఐషర్ వ్యానును స్వాధీనం చేసుకున్నారు. చోడవరం ఎస్‌ఐ బి.అప్పలనాయుడు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పాడేరు నుంచి గంజాయిని వ్యానులో అక్రమంగా తరలిస్తున్నట్టుగా మంగళవారం చోడవరం పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు నర్సయ్యపేట గ్రామ పొలిమేర వద్ద గౌరీపట్నం జంక్షన్ వద్ద పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. ఈ సమయంలో కర్ణాటక రాష్ట్ర రిజిస్ట్రేషన్ కెఎ51ఎజి 2182 నంబర్ గల ఐషర్ గూడ్సు వ్యాను జంక్షన్‌కు సమీపించడంతో నిలువరించి తనిఖీ చేయగా వ్యానులో 21 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన నేరంపై వ్యాను డ్రైవర్, కర్నాటక రాష్ట్రం, బెంగళూరుకు చెందిన రితీష్‌కుమార్ విల్సన్ అలియాస్ పీటర్(23), చిత్తూరు జిల్లా నాడికి చెందిన శ్రీధర్ అలియాస్ ఆర్.కుమార్(24)లను అరెస్టు చేశామన్నారు. నిందితుల వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, 21 కేజీల గంజాయి, ఐషర్ వ్యానును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ చెప్పారు. నిందితులిద్దరినీ బుధవారం జ్యుడిషియల్ కస్టడీకి తరలించామని ఎస్‌ఐ అప్పలనాయుడు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

మాకవరపాలెం : గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. గంజాయి తరలిస్తున్నట్టు ముందుగా అందిన సమాచారంతో మండలంలోని పైడిపాల జంక్షన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బస్సులో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకున్నామన్నారు. నిందితులు అల్లూరి జిల్లా రౌతుపాయల గ్రామానికి చెందిన నందు, అన్నమయ్య జిల్లా దాలవాయిపల్లెకు చెందిన చెన్నెపల్లి నితీష్ వద్ద నుంచి 4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

అనకాపల్లి టౌన్ : పురుగుమందు తాగిన చలమరశెట్టి రమణ(38) చికిత్స పొందుతూ విశాఖ కేజీహెచ్‌లో మృతి చెందినట్టు పట్టణ సీఐ దాడి మోహన్ చెప్పారు. వివరాలివి. బుచ్చియ్యపేట మండలం అప్పమ్మపాలెం గ్రామానికి చెందిన చలమరశెట్టి రమణ తాపీమేస్త్రిగా విధులు నిర్వహిస్తున్నాడు. మద్యానికి బానిసైన రమణ ఈనెల 26న పురుగు మందు తాగడంతో అతడిని ఎన్టీఆర్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రమణ భార్య రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

మృతురాలి వివరాలు లభ్యం

కశింకోట : కశింకోట వద్ద ఏలేరు కాలువలో లభించిన మహిళ మృతదేహాన్ని బుధవారం గుర్తించినట్టు మహిళా ఏఎస్‌ఐ ఎస్. సుందరమ్మ తెలిపారు. బుచ్చియ్యపేట మండలం మల్లాం గ్రామానికి చెందిన చందక నాగభూషణం (55)గా బంధువులు గుర్తించారన్నారు. ఈ నెల 24న తన గ్రామం నుంచి తాళ్లపాలెంలో సరుకులు కొనుగోలు చేసుకోవడానికి వచ్చి సమీపంలోని ఏలేరు కాలువలోకి కాళ్లు కడుక్కోవడానికి దిగి ప్రమాదవశాత్తూ జారి పడి కశింకోట వరకు మృతదేహం ప్రవాహంలో కొట్టుకు వచ్చి సోమవారం బయట పడిందన్నారు. బంధువులు రావడంతో ఆమె మృతదేహాన్ని గుర్తించినట్టు తెలిపారు. దీంతో పోస్టుమార్టం జరిపించామని, కేసు దర్యాప్తులో ఉందని తెలిపారు.

గడ్డి మందు తాగిన కౌలు రైతు మృతి



మృతుడు జగ్గారావు (ఫైల్)

కశింకోట : కశింకోటకు చెందిన కౌలు రైతు అప్పుల బాధ భరించలేక గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్‌ఐ ఎస్.సుందరమ్మ అందించిన వివరాల ప్రకారం..కశింకోటలోని గవరపేటలో కాశీభట్ల వారి వీధికి చెందిన పాలమరశెట్టి జగ్గారావు(47) కౌలు రైతు. ఇటీవల కుమార్తెకు వివాహం చేయడంతో అప్పులు కావడం భరించలేక ఈ నెల 11న గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు ఒడిగట్టాడు. స్థానికులు గుర్తించి సపర్యలు చేసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్చారు.అక్కడ మూడు రోజులపాటు చికిత్స పొంది ఇంటికి చేరాడు. అయినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో విశాఖ కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్య పార్వతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన జగ్గారావు మృతితో కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి-యలమంచిలి రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారి పడి 32 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు బుధవారం మృతి చెందినట్టు తుని రైల్వే పోలీసు హెడ్‌కానిస్టేబుల్ జి.మోహన్‌రావు తెలిపారు. గుర్తు తెలియని రైలు ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం జరిగిందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పి.ధర్మవరం సమీపంలో...

ఎస్.రాయవరం : పి.ధర్మవరం సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్‌ఐ ప్రసాద్‌రావు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శరీరంపై బ్లూ నిక్కర్ వేసుకుని సుమారు 50 సంవత్సరాలు వయస్సుగల వ్యక్తి గ్రామం సమీపంలో పొలంలో పడి మృతి చెంది ఉన్నట్టు చెప్పారు. మతి స్థితిమితం లేకుండా కొన్ని రోజులు ఈ ప్రాంతంలో సంచరించే వాడని స్థానికులు చెప్పినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరచామని, అతని వివరాలు తెలిసిన వారు ఎస్.రాయవరం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

కె.కోటపాడు : గుల్లేపల్లి గ్రామంలో గల మరిడిమాంబ అమ్మవారి ఆలయంలో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. ఆలయంలో గల అమ్మవారి హుండీ తాళం విరగొట్టి నగదును దొంగిలించుకుపోయారు. ఆలయంలో హుండీని గమనించిన గ్రామస్తులు దొంగతనం జరిగిందన్న సమాచారాన్ని కె.కోటపాడు పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్‌ఐ బి.రామకృష్ణ కేసును నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

రైతుకు సాయమందించడంలో నాదీ భరోసా

- టీడీపీ హయాంలో అభివృద్ధి కంటే రైతుల ఆత్మహత్యలే ఎక్కువ
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్



మంచినీటి కుళాయిని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్



వృద్ధురాలికి బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కంటే రైతుల ఆత్మహత్యలే ఎక్కువని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొల్లపేట, భూపతిపాలెం గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఇంటిం టికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. స్థానిక సమస్యల్ని తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం దండగని చంద్రబాబు అంటే, వ్యవసాయాన్ని పండగలా మార్చి చూపిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. రైతు దేశానికి వెన్నెముక అని నమ్మిన సీఎం జగన్ రైతులకు పెట్టుబడి భారం తగ్గిస్తూ, పంట దిగుబడి పెరిగేందుకు రాయితీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారని కొనియాడారు. ఆయా పంటలు చేతికి అందే వరకు నిరంతరం పర్యవేక్షించేలా వ్యవసాయశాఖ అధికారులను ఆదేశిస్తున్నారని పేర్కొన్నారు. రైతుల ముంగింటే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, నాణ్యమైన పంటలు పండించేందుకు ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి, రైతుల కళ్లల్లో సీఎం జగన్ ఆనందం నింపారన్నారు. ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన విత్తనాలను భూపతిపాలెంలో రైతులకు ఆయన అందించారు. ప్రభుత్వ పథకాలు అందుకున్న లబ్ధిదారులను కలిసి, సంక్షేమ పథకాలతో రూపొందిన బ్రోచర్లను అందించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అనకాపల్లి ప్రాంతంలో రైతులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు. వ్యవసాయరంగ అభివృద్ధిలో గత ప్రభుత్వానికి, జగన్ ప్రభుత్వానికి బేరీజు వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అంతకుముందు గొల్లపేట గ్రామంలో రూ.7 లక్షలతో నిర్మించిన మంచినీటి కుళాయి పథకాన్ని ప్రారంభించారు. అదే గ్రామంలో రామాలయం వద్ద మండపం నిర్మాణానికి రూ.3 లక్షలు, ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షలు మంత్రి కేటాయించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ స్టాంప్ కౌంటర్ ప్రారంభం



కౌంటర్ ప్రారంభించి, ఈ స్టాంప్‌ను అందిస్తున్న సబ్‌రిజిస్ట్రార్లు మూర్తి, బసవేశ్వరరావు

తుమ్మపాల : రిజిస్ట్రేషన్ వ్యవహారాలు, బ్యాంకు రుణం, అగ్రిమెంట్లకు సంబంధించిన లోటు స్టాంప్ డ్యూటీ, ఈ స్టాంపింగ్ పేపర్ ద్వారా పొందవచ్చని సబ్ రిజిస్ట్రార్లు ఏఎస్ఎస్ఎన్ మూర్తి, వి.బసవేశ్వరరావు తెలిపారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం ఈ స్టాంప్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్టాంప్‌పేపర్ ద్వారా నకిలీ విక్రయాలను అందిగమించవచ్చన్నారు. నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా అందిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, కామన్ సర్వీస్ సెంటర్ వీఎల్ఈ వి.వెంకటరాము పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోడూరులో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని కోడూరు గ్రామంలో గురువారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ప్రపంచం మెచ్చిన నేత పీవీ

అనకాపల్లిటౌన్ : మాజీ ప్రధాని, దివంగత పీవీ నరసింహరావు ప్రపంచం మెచ్చిన నేతని ఉత్తరాంధ్ర చర్చావేదిక ప్రతినిధి బుద్ధ రాజేష్ అన్నారు. పీవీ జయంతి సందర్భంగా గవరపాలెంలోని చర్చావేదిక యువజన కార్యాలయంలో బుధవారం పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి ప్రధానిగా పనిచేసిన మొట్టమొదటి తెలుగువ్యక్తిగా కొనియాడారు. ఆర్థిక సంస్కరణలతో భారతదేశాన్ని ప్రపంచదేశాల సరసన చేర్చిన మహానేతగా ఆయన చిరస్మరణీయుడన్నారు. 14 భాషల్లో మాట్లాడగలిగిన ఏకైక ప్రధాని పీవీయేనని కీర్తించారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు బొడ్డేడ వెంకట్రావు, బుద్ధ మహాలక్ష్మీనాయుడు, ఎల్.సూర్యనారాయణ, దాక్షారపు పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం మహా మృత్యుంజయ హోమం

- సోహం ఆశ్రమంలో 90 రోజులపాటు నిర్వహణ

అనకాపల్లిటౌన్ : మండలంలోని బట్లపూడి గ్రామంలో అంజనేయస్వామి గుడి వెనుక కొండపైనున్న సోహం ఆశ్రమంలో వచ్చే నెల 14 నుంచి 90 రోజులపాటు లోకకల్యాణార్థం మహా మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు కాండ్రేగుల రవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకూ ఈ మహా హోమం జరుగుతుందన్నారు. పూజలో పాల్గొనే భక్తులు ముందుగా ఆశ్రమంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూజలో పాల్గొనే భక్తులు రెండు కిలోల ఆవు నెయ్యితో పాటు, పూజాసామాగ్రిని వెంట తీసుకురావాలని కోరారు. పూజలో పాల్గొనే భక్తులకు ఉచితం భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. వివరాలకు 99669 08908 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

రైతులకు రాయితీ విత్తనాల పంపిణీ



వరి విత్తనాలు అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట : మండల రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు వరి విత్తనాలను స్వయంగా ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వ్యవసాయ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుని మెరుగైన పంట దిగుబడులకు రైతులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, కశింకోట సర్పంచ్ మంత్రి జయరజని, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు, మండల వ్యవసాయ అధికారి స్వప్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకుడు అద్దెపల్లి శ్రీనివాసరావు, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఏఈవో ఎ.శ్రీను, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలుంటే జగనన్న సురక్షలో నమోదు చేయాలి'



మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. మండలంలోని గోపాలపురం గ్రామ సచివాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని జగనన్న సురక్ష యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందుకు మండల స్థాయిలో అధికారులతో రెండు టీమ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జూలై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ముందుగా ప్రజల సమస్యలను తెలుసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేసి, అధికారులు నిర్వహించే గ్రామ సభల్లో వాటిని చర్చించి, పరిష్కరిస్తారని తెలిపారు. ఈ నెల 30న గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆర్‌బీకేలను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి.నరసింహారావు, ఈవోఆర్డీ కె.ధర్మారావు, మార్టూరు సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రోయిన్ల మరమ్మతులకు కృషి





శారదానది తగరంపూడి గ్రోయిన్లను పరిశీలిస్తున్న దాడి రత్నాకర్

- సొంత నిధులతో గేట్ల ఏర్పాటు
- రైతులకు దాడి రత్నాకర్ హామీ

అనకాపల్లిటౌన్ : శారదానది పరివాహక ప్రాంతంలో ఉన్న తగరంపూడి గ్రోయిన్లను విశాఖ రైతు సమాఖ్య అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త దాడి రత్నాకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగరంపూడి గ్రోయిన్ల మరమ్మతులకు అవసరమయ్యే నిధుల గురించి నీటిపారుదల శాఖ డీఈ చరణ్‌ను ఆరా తీశారు. ప్రధానంగా తగరంపూడి గ్రోయిన్ల మరమ్మతులకు రూ.87 లక్షలు అవసరమవుతాయని గతంలో ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు డీఈ చరణ్ తెలిపారు. దీంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా రత్నాకర్ అధికారులను సూచించారు. గ్రోయిన్ల రక్షణకు ఏర్పాటు చేసిన గేట్లు పూర్తిగా దెబ్బతినడంతో రైతుల సాగుభూముల చేరాల్సిన నీరు, పక్క కాలువల నుంచి నీరు వృథాగా పోతోందని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నీటి వృథాను అరికట్టేందుకు తమ సొంత నిధులతో గేట్లను తయారుచేయించి రైతులకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేస్తామని భరోసానిచ్చారు. గ్రోయిన్లపై ఆధారపడి 572 ఎకరాల విస్తీర్ణంలో సాగు జరుగుతోందని, ఈ ఏడాది రైతులకు సాగునీటి ఇబ్బందుల్లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా కృషిచేస్తానన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌బాబు మాట్లాడుతూ గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టకుంటే ఈ ప్రాంతమంతా బీడుగా మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయదారుల సంఘం జిల్లా కార్యదర్శి భీశెట్టి కృష్ణఅప్పారావు, రైతులు బొడ్డపాటి చినరాజారావు, ఉప్పలపాటి రవిరాజ్, పూసపాటి రాజాబాబు, నందవరపు కుమార్, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, దాడి రాము, వేపాడ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



క్షయ రోగులకు పోషకాహార కిట్లను అందిస్తున్న ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి రూరల్ : వ్యాధుల బారిన పడినవారు మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. బుధవారం తగరంపూడి పీహెచ్‌సీలో ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్‌లో భాగంగా పలువురు క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహారం, క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ నుంచి విముక్తి పొందవచ్చన్నారు. ప్రభుత్వాస్పత్రుల ద్వారా క్షయ రోగులకు శక్తివంతమైన మందులు పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. 2025 నాటికి క్షయ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ రూపొందించాయన్నారు. వైద్యాధికారి పావని మాట్లాడుతూ ప్రతి నెలా తమ ఆస్పత్రి పరిధిలో నమోదైన క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అయితా ఆనందరాము, సర్పంచ్ యాదగిరి అప్పారావు, ఫార్మసిస్ట్ వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 122 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	4,100	4,400
మూడోరకం	3,550	3,810

అనకాపల్లి సినిమాలు

మనుచరిత్ర	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
ఇండియానా జోన్స్	: సత్యనారాయణ స్క్రీన్-2
ఈ నగరానికి ఏమైంది?	: షిర్డిసాయి
అశ్విన్స్	: పర్తిసాయి
భీమదేవరపల్లి బ్రాంచి (3 ఆటలు)	
ది ఫ్లాష్ (మ్యాట్నీ)	: వెంకటేశ్వర
స్పై	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ నెగిటివ్-3 యూనిట్, బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గంగయ్య(9182834480)ని సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 467 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 392 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

నూరి మసీదుకు నూతన కమిటీ

కశింకోట : స్థానిక నూరి మసీదుకు నూతన కమిటీని రాష్ట్ర వక్ఫ్ బోర్డు తాజాగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు కమిటీ నూతన బుధవారం ఓ ప్రకటలో తెలిపింది. రెండేళ్లపాటు మనుగడలో ఉండే కమిటీకి అధ్యక్షుడిగా సయ్యద్ రహ్మతుల్లా, ఉపాధ్యక్షుడిగా ఎండీ కరీముల్ రెహ్మాన్(బాబర్), కార్యదర్శిగా ఎస్ఎంఎం అలీ, కోశాధికారిగా అబ్దుల్ రజాక్, సభ్యులుగా మహ్మద్ అబ్దుల్ రబ్బానీ, సయ్యద్ రహ్మతుల్లా బొకారి, మహ్మద్ ఇంతియాజ్ షరీఫ్, అబ్దుల్ రషీద్‌ఖాన్, మహ్మద్ అహ్మద్ హుస్సేన్, సయ్యద్ మహబూబ్ సుబానీ, షేక్‌పీర్ సాహెబ్‌లను నియమించారు.

'జగనన్న కాలనీలో వసతులు కల్పించాలి'

కశింకోట : వైఎస్సార్ జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు కోరారు. సీపీఐ ప్రతినిధుల బృందం కశింకోటలోని వైఎస్సార్ జగనన్న కాలనీలను బుధవారం సందర్శించి, అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.ఎస్.సన్యాసిరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల నియామకాల నిలుపుదలకు వినతి

కశింకోట : మండలంలో ప్రకటన లేకుండా చేపట్టిన వీఆర్‌ఏల నియామకాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ జి.సత్యనారాయణకు మండల వీఆర్‌ఏల సంఘం తరపున బుధవారం వినతి పత్రం అందించారు. ఖాళీ అయిన పోస్టుల స్థానంలో నోటిఫికేషన్ లేకుండా వీఆర్‌ఏలను నియమించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లెక్కలు జీవితంలో ఒక భాగం

అనకాపల్లిటౌన్ : స్టాటిస్టిక్స్(లెక్కలు) అనేవి ప్రపంచంలో ఏ దేశానికైనా, ఏ సంస్థకైనా చాలా ముఖ్యమని, ఆ దేశం, సంస్థ అభివృద్ధిని గణాంకాల ద్వారానే నిర్ణయించవచ్చని జిల్లా ఎకనామికల్ స్టాటిస్టికల్ జాయింట్ డైరెక్టర్ జి.రామారావు అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాలలో ఆధునిక గణాంకాల పితామహుడు ప్రశాంత చంద్ర మహాల్‌నోబిస్ జయంతిని పురస్కరించుకుని నేషనల్ స్టాటిస్టిక్స్ డే వేడుకలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో వేసుకునే లెక్కలను స్టాటస్టిక్స్‌గా పేర్కొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులు ప్రదర్శించిన స్టాటస్టిక్స్ ప్రాజెక్టులను తిలకించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, వైస్‌ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ నిలుపుదల

అనకాపల్లిటౌన్ : పట్టణంలో జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా గవరపాలెం పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంతబయలు, పెదనుయ్యి, రచ్చరాళ్ల ఏరియా, చినరామస్వామి గుడి, ఎన్టీఆర్ కాలనీ, కత్రివారివీధి, దుర్గాలాడ్జి రహదారి, పెదరామస్వామి గుడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

బుద్ధావతారంలో జగన్నాథుడు



బుద్ధుని అలంకరణలో జగన్నాథస్వామి

అనకాపల్లిటౌన్ : స్థానిక గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాల్లో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు బుద్ధావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలయ అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేకపూజలు, తెల్లవారుజామున సుప్రభాత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అలయానికి వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదం అందించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో కె.ఆదినారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కశింకోట : దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారిని బుద్ధావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విష్ణుమూర్తి దశావతారాల్లో 9వ అవతారమైన బుద్ధుని రూపంలో అందంగా అలంకరించి విష్ణు సహస్రనామార్చన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి, రేజేటి రామచరణాచార్యులు తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. గురువారం జరగనున్న తిరుగు రథోత్సవంతో ఉత్సవాలు ముగియనుండటంతో భక్తులు ఎక్కువగా హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కశింకోట : కశింకోటలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఆగి ఉన్న మినీ వ్యాన్‌ను వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొంది. దీంతో పరవాడపాలెం సర్పంచ్ బలిజ మంగ, కుమారుడు గాయపడ్డారు. వీరిని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.